# మునసబుగారి సంతర్పణ

యం. వై. రెడ్డి

కథానిక

రాత్రి ఎనిమిది గంటలవుతోంది. ఆ సమయంలో ప్రతి పట్టణంలోని వాతావరణానికి బద్ధశత్రువుగా వుంటుంది ప్రతిపల్లెలోని వాతావరణం. పట్టణంలో, రణగొణధ్వని; పల్లెలో, గంభీరనిశ్శబ్దం. మనకథకు సంబంధించిన ఒకానొక పల్లెలో, సంవత్సరానికి దాదాపు పది పర్యాయములు మాత్రము ఆ గంభీర నిశ్శబ్దం కుంటుపడు తూండేది.

ఆ నిశ్శబ్దానికి ఎప్పుడు భంగంకలిగేది అందరికీ ముందుగానే తెలుస్తుంది. కాని ఆ రోజు, రాత్రి ఎనిమిది గంటలకు తద్వ్యతిరేకంగా పరిస్థితులు పరిణమించాయి. కాదు; పరిస్థితులు మారటం గ్రామమునసబు చేతి చలువ.

ఆరోజు(రాత్రి 8గంll లకే అనుకోండి)ఆవూరి రచ్చబండ మునసబుగారికి ఆతిథ్యమిచ్చి, అంత వాడు తన అతిథి అయినందుకుసంతోషిస్తూ, కిలకిలా నవ్వింది. కాని ఆ కిలకిల నవ్వులు మాత్రము ప్రతిధ్వనించలేదు. మునసబుగారు ఏకాంతాన్ని తీరికగాభోంచేయవలసివచ్చింది. ఏకాంతంగా అని ఎందుకన్నానంటే మునసబుగారి శాశ్వత అంగరక్షకుడైన బోయకట్టుబడి వీరన్న ఎప్పుడూ, ఆయన సమక్షంలో నిలుచబడి ఉండవలసిందే. వీరన్న ఉన్నా, లేనట్టే గనుక- మునసబుగారికది ఏకాంతం.

మునసబు ఏ కార్యం లేనిది ఆ చోటుకు రాడు. కాబట్టి వీరన్న తదేకదృష్టితో మునసబు వైపు చూడటం మొదలెట్టాడు. అంతలో మునసబుగారి పెదవులు విడివడ్డాయ్. "వీరిగా! (కులాన్ని బట్టి అందరు, చిన్నా-పెద్దా, అనేభేదం లేకుండా అతన్ని అలాగే సంభోదిస్తుంటారు; అది, అతనికి గర్వకారణం). ఊరిలో ఓ పదిమంది రైతులను, ఊండేనలుగురు కోమట్లను పిలుచుకురా! నే పిలుస్తున్నానని చెప్పు." ప్రస్తుతానికి ఆజ్ఞావచనాలు నిలుపు చేయబడ్డాయ్.

"ఎవర్రా అక్కడ? 'నేనేబాబు! కోటిగాణ్ణి' (ఇలా అనిపించుకోటం, ఇతనికికూడ గర్వకారణం.) 'ఎక్కడికిరా, ఇప్పుడు?' 'పల్లెకుబాబూ చాల అలస్యమయింది. పోతా; పాములు, తేళ్ళూ...' కోటయ్యకు వాక్యాన్ని పూర్తిచేసే ధైర్యంలేక చేతులు పిసుక్కుంటూ నిలబడ్డాడు. 'నిలబడు, నీతోపనుంది.' కోటయ్య శరీరం కొద్దిగా దూరంగా పోయి నిలబడింది. కోటయ్య పీల్చేగాలి మునసబుగారి నాసికా పుటాలు ప్రవేశించిందా, ఇద్దరూ అపవిత్రులవుతారు మరి! అది ఏమంత విచిత్ర విషయంకాదు!

బిలబిలమంటూ వచ్చి పదిమంది రైతులు, నలుగురు కోమట్లు, మునసబుగారి రాజఠీవిముందు సేవకులవలె నిలబడ్డారు. "రండి రండి. కూర్చోండి" మునసబుగారి ఆహ్వానాన్ని అందుకొని వారు కులాన్నిబట్టి (గౌరవ మర్యాదలబట్టి) తలో ప్రక్క ఆసీనులయ్యారు.

మునసబుగారే ప్రసంగాన్ని ఆరంభించారు. "నిన్ననొక విచిత్రమైన కల వచ్చింది. కలలో పోలేరమ్మ పండ్లు పటపట కొరుకుతూ, 'ఏమ్, రెడ్డీ! నన్ను, మరిచ్చారామీరు? మీ గ్రామాన్ని పీల్చుకు పిప్పిచేస్తా! ఇదివరకు నాకొక సంతర్పణ చేస్తామని బడాయి వాగ్దానాలు చేశారే! ఇప్పుడు చేస్తారా, లేదా?' ఏం, చెప్పుతారు మీరు? ఇప్పుడు చేయక తప్పదు మరి! ఇది నాకోసం కాదుగదా! అందరూ, తలా ఓ చేయి వేస్తే కార్యం గట్టెక్కుతుంది. లేకుంటే..." ఆ వాక్యం సగంలోనే నిలుపబడింది. సగంలోనే అందరికీ భోదపడటం వల్ల, ఎవరూ మునసబుగారి నావాక్యం పూర్తి చేయమని కోరలేదు. మునసబుగారికి, వారలా తనను కోరరని తెలుసు.

ఇందులో, ఏదో గూడు పుఠాణీ వుందని అందరికీ అవగతమే! కాని, ఏ ఒక్కడికీ అనుమానాన్ని

వెలిపుచ్చే "కలేజా" లేకపోయింది. ఆ గూడు పుఠాణి సంగతి ఇది: "నెలరోజుల క్రిందట మునసబుగారి కుమారరత్నమునకు చావు జబ్బు వచ్చింది. బాగవుతే, ఓ సంతర్పణ (కుంకుమ బండి కట్టిస్తామంటే, పోలేరమ్మ, అది తనకు తగవని అంటుందేమోననే అనుమానంచేత) చేయిస్తానని, జబ్బు తొలి రోజులలోనే, స్నానాదికంబు లొనర్చి, భార్యాసమేతుడై, బంధుజన సమక్షంలో వాగ్దానం చేశాడు. దగ్గరలోనేఉన్న పట్టణంలోని డాక్టరు చేతిచలువవల్ల, జబ్బు నయమయింది. గ్రామ మునసబుగారి నమ్మకం కరుణామయి, పోలేరమ్మ దేవి చల్లనిచూపని. తన వాగ్దానం ప్రకారం, సంతర్పణ చేయాలి; చేసితీరాలి. కాని సంతర్పణ అంటే మాటలా! ఆఖర్చులు, తానొక్కడే భరించలేననే అనుమానం (భరించగలడు; ఖర్చుపెట్టే ఇష్టంలేదు) అతని మనస్సును, చెదపురుగులా తొలచడం ప్రారంభించింది. నాలుగయిదు రోజులు తీవ్రంగా ఆలోచించాడు. సంతర్పణ చేయకూడదనుకున్నాడు. తన వాగ్దానం సంగతి? వాగ్దానము వెనుకకు లాగుకొన వచ్చుననుకొన్నాడు. ఇందుకు, పోలేరమ్మ కోపించి, ఏదేనా చెడు తలపెడితే...?" అవతల ఆలోచించే ధైర్యం లేకపోయింది. చేయక తప్పదనుకున్నాడు. బుర్ర బద్దలు కొట్టుకొన్నాడు. చివరకు ఒక ఆలోచన తట్టింది. ఆ ఆలోచన, ఓపన్నాగముగా పరిణతి చెందింది. ఆ పన్నాగానికి తన సతీసుతులు ఆమోద ముద్ర వేశారు. ఆ పన్నాగ ఫలితమే, ఈ సమావేశం!

సభాసదులందరినీ ఒకేఒక అనుమానం పీడించింది. అందరు, తమతమ బుర్రలతో కుస్తీ ప్రారంభించారు. అందరి ఆలోచన ఒక్కటే తాము, ఎప్పుడు ఏలాంటి పరిస్థితులలో ఆలాంటి వాగ్దానం (సంతర్పణ చేయిస్తామనే వాగ్దానం) చేశామని. ఎవరికీ ఆ ఆలోచనలనుండి విముక్తిపొందే అవకాశం లభించలేదు; లభించదేమోకూడా. అందరి కనుబొమ్మలు కుంచించబడి ఉన్నాయి. మునసబుగారి ఆలోచనకు, తదితరుల ఆలోచనకు తేడా ఉంది. మునసబు, మిగతావారు ఏమని ఆలోచిస్తున్నారా, అని ఆలోచిస్తున్నారు. మిగతావారు వాగ్దానాన్ని గురించి ఆలోచిస్తున్నారు. అంతలో మునసబుగారి కనుబొమలు యథాస్థితి నందాయి. ఆస్థితిని బట్టి, ఆయన ఆలోచనలు తమ గమ్యస్థానాన్ని చేరాయనే అనుకోవాలి. "ఏం, మీరు, నన్ను అనుమానిస్తారా? ఇంతవరకు నన్ను అనుమానించే వారు: ఈ ప్రపంచంలో పుట్టలేదు. నాలుగు నెలల క్రిందట, మన వూరిలో కలరాలేదా? అప్పుడే మరిచారా మీరు?" అధికార స్వరం కొద్దికాలం విశ్రాంతి నొంద నిశ్చయించింది. అధికార నేత్రములు సగర్వంగా చూశాయ్.

ప్రస్తుతానికి అనధికారుల మొగములు కొద్దిగా విశాలమయినయ్. గుసగుసలు బయల్దేరాయి. వారసలు ఏనాడూ అలాంటి వాగ్దానంచేయలేదు. మునసబుగారి పలుకులలోని అబద్ధాలో, వారు సత్యాన్ని సృజించుకొని, అతని మాటలను నమ్మారు. మునసబుగారు, తన కార్యం గట్టెక్కిపోతున్నందుకు ముసిముసి నవ్వులు ప్రదర్శించాడు. మిగతావారు ఈ కార్యం ఎలా గట్టెక్కించాలనే ఆలోచనలో పడ్డారు.

అనధికారులు తమ అనుమానాలను, వినయపూర్వకంగా విన్నవించుకున్నారు. ఆ అనుమానాలన్నింటిని సమీక్షిస్తే తేలే విషయం ఒకటే: "సంతర్పణ ఎలా జరిపించాలి?" ఆ విషయంమీద సభలో తర్జనభర్జనలు రేగాయి. మునసబుగారు, పెద్దరైతు రామయ్యను సంబోధించి "మావగారూ! మీరు పెద్దవారు ఎలాచేయటం మంచిదంటారు? ప్రతి పుట్టికి పన్నెండుశేర్ల గింజలు తీస్తే..." "బాబ్బాబు! బీదవాళ్ళం; కనికరించండి. ఈ సంవత్సరం నాకు పంట బాగాపండలేదు. నాకు, నాది అని చెప్పుకునేందుకు ఒక సెంటు భూమికూడా లేదు. ఈ సంవత్సరం ఓ పుట్టిగింజలు మాత్రమయినాయి. అధమం ఇంకో పుట్టి అయినా బదులు తెచ్చుకోకుంటే పొట్టగడవదు. నేను సంతర్పణ గింజలు..." పాపం, ఏదో అవ్యక్త ఆవేదనతో నిండి ఉంది అతని హృదయం. ఆ హృదయంలోని ఆవేదనకు కరకురాతి గుండెకూడా మంచుగడ్డలా కరుగుతుంది. మునసబుగారిది మంచుగుండెకాదు గనుక కరుగదు. విజ్ఞాపన రైతు వెంగయ్యది.

ఈ విజ్ఞాపనకు, అలాంటి పరిస్థితులలోనే ఉన్న మరొక రైతు ఆమోదం లభించింది. ఈ రైతుకు వస్త్రాలనేవిలేనట్టే అగుపడుతుంది. ఇప్పటి

ఈ రైతుకుచెందిన శిథిలశరీరము ఒకప్పుడు మెలికలుతిరిగిన కండలలోనున్న శరీరాన్ని జ్ఞాపకం చేస్తూంది. అతని శుష్కించియున్న విశాల ఛాతీని ఆచ్ఛాదిత మొనరించే భాగ్యం ఆఖరుకి చింపిరి వస్త్రానికైనా కలుగలేదు. అతని కటిప్రదేశానికి మాత్రం ఒక పలుచని గుడ్డ అతుకుకొని ఉంది. అది సంవత్సరంక్రింతం కొనిన పంచె. ఆ క్రొత్తపంచెలోని పోలికలు, ఇప్పటి పాతపంచెలో మచ్చుకైనా లేవు. అప్పటి క్రొత్తపంచె, ఇప్పటి పాత క్రొత్తపంచె. కారణం: ఆ పాతపంచె అనేకచోట్ల శస్త్రచికిత్స చేయించుకొని, అతుకులు వేయించుకుని, క్రొత్తపంచెగా తయారయింది.

మునసబుగారు ఆగ్రహోదగ్రుడయ్యారు; గర్జించారు. "నాకొరకు చేసినట్లు మాట్లాడతారేం? మీకు పుణ్యం అక్కర్లేదా? గింజలివ్వరు. పుణ్యం మాత్రం కావాలేం!" ఈ భీకర తర్కానికి కూడా తట్టుకొని, వెంగయ్య లేచాడు. చేతులు కట్టుకున్నాడు. "మీరు నాకు పన్నెండుశేర్ల గింజలు బాకీ ఇస్తే..." మునసబుగారి తర్కం ముందుకు సాగింది. "వెంగయ్యా! పుణ్యకార్యాలెప్పుడూ బాకీలు చాకీలతో నుండరాదు. అంతా ఠంచన్‌గా జరుగుతేగాని పుణ్యంరాదు. రేపు నీవు నరకలోకానికి పోతే అక్కడి కష్టాలు... బాధలు. ఇప్పుడు ఓ పుణ్యకార్యమయినా చేయకపోతే ఎలా?" వెంగయ్య తన భాగం గింజలు బాకీగాకాక, ఆయననే ఇవ్వమందామని ముందు అనుకున్నాడు గాని, మునసబుగారి తర్కం అతన్ని ప్రశాంత చిత్తుని గావించింది.

తర్జనభర్జనల అనంతరం పుట్టికి పంద్రెండు శేరులు తీయాలని నిర్ణయింపబడింది. అడవి, ఆ చుట్టుప్రక్కలలోనే ఉన్నందువలన కట్టెలవిషయం ఏవరూ పట్టించుకోలేదు. తరువాత అందరి మనస్సులు (కోమటివితప్ప) ఒకవైపు కేంద్రీకరించబడ్డాయి. కూరగాయలు, బెల్లం వగైరాలమీద.

గ్రామమునసబుగారి కంఠం ఖంగున మ్రోగింది. "ఏమండోయ్! ఇవన్నీ మీ నలుగురికే అప్పగిస్తున్నాం. ఈ వూరిలో వ్యాపారచేసేది మీ నలుగురే కదా!" ఇంతలో మునసబుగారికి చేరువగా కూర్చున్న ఒక శెట్టి, ఆయన చెవిలో మెల్లిగా గొణగటం మొదలెట్టాడు. "ఏమండోయ్! నేను చాల బీదవాణ్ణి. కనికరించాలి. నన్నీ బాధ్యతనుండి తప్పిస్తే, మీకు ఓ అయిదు రూపాయలు ఇస్తాను. మీ దయ. మీ...ద...య." ఆ సభలో, ఎవరికీ ఆ సంభాషణ వినిపించలేదు. అందువలన, అందరు, మిగతా ఇరువురి వైపు చూడ ప్రారంభించారు. గ్రామమునసబుగారి నోటికి మరల పని తగిలింది. "చూడండి! ఈ శెట్టి చాల బీదవాడు. (అసలు అందరిలో అతనే భాగ్యవంతుడు) కాబట్టి మిగతా ముగ్గురే, ఈ ఖర్చు భరించాలి." ఆదేశపూరితంగా ఉన్నాయి ఆమాటలు.

ముగ్గురి ముఖాలు తెల్లబడ్డాయి. నోళ్లు తెరచుకున్నాయ్. మాటలు బయటికి రావటం మొదలెట్టాయి. "అరరే! మేము ముగ్గురం ఏలా భరించగలమండీ, అన్ని ఖర్చులు? మేం సగం ఖర్చులిచ్చుకుంటాం. మిగతా ఖర్చులకు పైకం, వూర్లో వసూలు చేద్దాం." మునసబుగారొక్కరే, సమాధాన మివ్వ సాహసించారు. "పుణ్యకార్యంలో, భాగాలేమిటండీ! మీ కొచ్చేపుణ్యంలో సగభాగం వేరే వారికిస్తారా? ఏం తెలివండీ! ఏం తెలివి!" కోమట్లు "పుణ్యాని కంటూ నీళ్ళు వదలుకోటానికైనా సిద్ధపడతాం కానీండి, మేము మాత్రం అంత ఖర్చుభరించము" అంటూ ఎదురు తిరిగారు. సంభాషణ ముదిరి పాకాన పడేట్లుందని, భయపడి, మునసబువారి షరతుల కంగీకరించాడు.

తరువాత కార్యక్రమం సాఫీగా నడిచింది. పెద్దరైతు రామయ్యగారి గొంతుకట్లు, ఈసారి విప్పబడ్డాయి. "అందరు, రేపుఇండ్లదగ్గిరేఉండండి ఎవరు, ఏపనులకు పోకూడదు. రేపే గిజలవసూలు ప్రారంభిద్దాం." అందరు తమ ఆమోదనను తెలిపారు. అప్పటికి రాత్రి పదకొండు గంటలు కావస్తోంది. అంతవరకు కోటయ్య (ఇతను హరిజనుడు. అయినా, అందరు మాలవాడంటారు) పల్లెకు పోయేవాడల్లా మునసబుగారి ఆజ్ఞకు బద్ధుడై "రేపు మా ఇంటి దగ్గిరకు రా! గింజలు గట్రా అంతా నీవే మోయాలి! ఏం, తెలిసిందా? ఇక నీవు ఇంటికి పో!" పాపం ఈ రెండు మాటలకోసం అతను మూడు గంటలసేపు నిలబడవలసి వచ్చింది. మునసబుగారి అనుజ్ఞచే, అందరు తమతమ గృహాభిముఖులై వెళ్ళారు.

ఆ కుగ్రామంలో ఇలాంటిదైవకార్యం జరిగేప్పుడు ఉండే గందరగోళమే ఇప్పుడుకూడ ఉంది. అందరు తలా ఓ చేయివేసి ఈ పుణ్యకార్యాన్ని గట్టెక్కించి పుణ్యం సంపాయించవలెననే ఆలోచనలోనే ఉన్నారు. సరంజామా సేకరణ మరునాడు ప్రారంభించారు.

కోటయ్యతోను, ముగ్గురు రైతులతోను కూడి, మునసబుగారు బయలుదేరే సమయానికి, పెద్ద రైతు రామయ్య ఎద్దుల కాడి భుజాన పెట్టుకుని ఎదురయ్యాడు. మునసబుగారు "ఏమండీ! మీరే ఇలాగచేస్తే ఎలా? రేపు ఎవ్వరూ పనులకు పోకూడదని మీరే చెపితిరి కదా! మరి ఇలా అవుతే..." "ఏదో కాడి కొద్దిగా చెడిపోతే బాగుచేద్దామని" "అబ్బే, అలాగకాదు. కాడి మా ఇంట్లో పెట్టండి. తరువాత తీసుకుపోవచ్చు. మొదటి భోణీ మీదే నండోయ్. ఈ గౌరవమంతా మీకే దక్కాలి."

పెద్దరైతు రామయ్యగారి గుండెల్లో రాయి పడింది. గ్రామమునసబును తప్పించుకొని పోవాలనుకున్నాడు. వీలు పడలేదు. ఇప్పుడు గింజలు, ముందు తనివ్వవలసి వచ్చింది. తప్పదుమరి. "పోదాం పదండి"అన్నాడు నైరాశ్యంగా. "ఏమండోయ్, మీకు పండింది ఇరవైపుట్లు కదా! రెండు వందల నలభై శేర్లివ్వాలి, మీరు!" "ఆ...ఆ...ఆ! రెండువందల నలభై శేర్లే! నాకొంప మునిగినట్లే" (పుణ్యంకోసం అనేది ఆయనకు గుర్తుకు రానట్లుంది)! అంటూ నోరు తెరిచాడు రామయ్య. అసలు రామయ్యగారికి ముప్పైఎపుట్ల గింజలు పండాయని అందరు తన్ను పీక్కుతింటారని, ఇరవైపుట్ల గింజలుమాత్రమే పండాయని బొంకాడు. "అబ్బే! నాకన్ని గింజలెక్కడివండీ? మాట వరుస కలాగ అన్నాను. నాకు పండింది పన్నెండుపుట్లే!" అబద్ధాల జాబితా ఎక్కువయింది. రామయ్యగారి దగ్గర నూటానలభై నాలుగు శేర్లు మాత్రమే వసూలు చేయబడ్డాయ్.

వారం రోజులలో కావలసిన సామగ్రినంతా సేకరించారు. ఒకానొక శుభముహూర్తాన గ్రామ ప్రజ సమక్షాన జరిగింది. బ్రహ్మాండంగా సంతర్పణ పెద్దపెద్ద ముసలివాళ్ళే, తామెప్పుడు తమ జీవితంలో ఇలాంటి సంతర్పణ జరగటం చూడలేదని అన్నారు. ఆ సంతర్పణకు పెత్తందార్లు దమ్మిడి తన సొంతజేబులోంచి ఇవ్వని మునసబు; పెద్దరైతు రామయ్య. ఆరోజు ఆ చుట్టుప్రక్కల గ్రామాల్లో కలవారి యిండ్లలో నిప్పు నామమాత్రానికైనా లేదు.

కాని ఆరోజు జరిగిన ఓ దుష్టకార్యాన్ని మాత్రం ఎవరూ మరువలేరు. అగ్రకులజులంతా భోంచేసిన పిమ్మట, అలగాజనం పోగయ్యారు. ఈ జనానికి ముందు కోటయ్య ఉన్నాడు. కోటయ్య వెనుక రెండుమూడు వందలమంది జనం ఉండొచ్చు. వడ్డన పళ్ళెరము జనముందుకువచ్చేప్పటికి వెనుకవారిలో తోపుడు ఎక్కువయింది. ముందువారు మాత్రం బిగబట్టి నిలబడ్డారు. కోటయ్య శరీరం పొరపాటున వడ్డనపళ్లెరాన్ని స్పర్శించింది. అంతే; కోటయ్య ఆ పని బుద్ధిపూర్వకంగా ఆ సైతానుపని చేశాడని తలోతన్ను అతను మూర్ఛపోయేంతవరకు తన్నారు. అందరు ఈ పుణ్యకార్యంలో పాల్గొన్నారు. సంతోషించారు. ఈ పుణ్యకార్యాన్ని, తమ పుణ్యకార్యాల ఝాబితాలో ఎక్కించారు. మునసబుగారు తనది దమ్మిడీఖర్చు లేకుండా మాటప్రకారము సంతర్పణ జరిపించి నందుకు పుణ్యం తప్పకుండా వస్తుందనే ధీమాతో మీసాలు మెలివేశాడు.

ఆఖరికి కోటయ్య అచేతన శరీరందగ్గరకు ఓ ఎర్ర టోపీ చేరేప్పటికి జరిగిన ఉదంతాన్ని చెప్పటానికి ఆ పరిసరప్రాంతాల్లో మోతుకాములెవ్వరూ లేరు.

---

కేపిటలిస్టుకీ కమ్యూనిస్టుకీ మధ్యనున్న తేడా ఏమిటో చెప్పవలసిందని పార్టీ ప్రచారకుని ఒకనిని బుడాపెస్టు నగరంలోని ఒకపౌరుడు అడిగాడు: "ఏముందీ? చాలా తేలికే. కేపిటలిస్టుకు అన్నిటికంటె డబ్బుపై మమకారం ఎక్కువ. కమ్యూనిస్టులు డబ్బుకంటె ప్రజలు విలువైనవారని భావిస్తారు" అన్నాడు కామ్రేడ్.

"ఓహో అలాగా కేపిటలిస్టులు తమడబ్బును బంధించివుంచుతారు, కమ్యూనిస్టులు ప్రజలను నిర్బంధించివుంచుతారు అందుకేనన్న మాట!" అన్నాడు ఆ పౌరుడు.

WATA NIKETANAM